రోడ్డుపైనే మురికి నీరు..!

- అంగడిబజార్‌లో డ్రెయినేజీలు లేక తిప్పలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల ముందు పారుతున్న మురికి నీరు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని అంగడిబజార్(వీక్లీమార్కెట్) కాలనీలో మురికి కాలువలు లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కాలనీలో మురికి కాలువలు నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు కాలనీవాసులు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సిర్పూర్(టి) బస్టాండ్ ప్రాంతానికి అతి సమీపంలో ఉన్న అంగడిబజార్(వీక్లీమార్కెట్) కాలనీ గుండా ప్రతీరోజు అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల ముందే మురికి నీరు..

సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని అంగడిబజార్(వీక్లీమార్కెట్) ఏరియా కాలనీలో మురికి కాలువలు లేక కాలనీల ఇళ్ల ముందర మురికి నీరు పారుతుండటంతో కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలో మురికినీటితో ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీలో మురికి కాలువలు నిర్మాణాలు చేపట్టాలని మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా మురికి కాలువల నిర్మాణాలు మాత్రం చేపట్టడంలేదు. కాలనీలోనే వారసంత నిర్వహిస్తుండడంతో ప్రతీ శనివారం సంతకు వచ్చే మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నో ఏళ్లుగా మురికి కాలువలు నిర్మించాలని కాలనీవాసులు గ్రామపంచాయతీ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని కాలనీ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులతో అవస్థలు..

వర్షాకాలంలో వర్షం నీటితో పాటు మురికి నీరు ఇళ్ల ఆవరణల్లో, సంతలో పారుతుండడంతో కాలనీ ప్రజలు సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధుల బారిన పడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. మురికి నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో మురికి నీరు ఇళ్ల ఆవరణల్లో పారుతుండటం, కాలనీలోని పిల్లలు అక్కడే ఆటలాడుతుండటంతో వ్యాధుల బారిన పడుతున్నారని కాలనీ ప్రజలు వాపోతున్నారు. అంగడిబజార్(వీక్లీ మార్కెట్) కాలనీలో మురికి కాలువల నిర్మాణాలకు అధికారులు ప్రత్యేక చొరవ చూపించి మురికి కాలువల నిర్మాణాలు చేపట్టాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



అంగడిబజార్(వీక్లీ మార్కెట్) కాలనీలో మురికి కాలువలు లేకపోవడంతో ప్రతీరోజు మురికి నీటితో కాలనీ ప్రజలందరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మురికి నీరు ఇళ్ల ఆవరణతో పాటు సంతలో పారుతుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు స్పందించి కాలనీలో మురికి కాలువల నిర్మాణాలు చేపట్టాలి. – సద్దాం, కాలనీవాసి

అధికారులు స్పందించడం లేదు



అంగడిబజార్ (వీక్లీ మార్కెట్) కాలనీలో మురికి కాలువల నిర్మాణాలు చేపట్టాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. మురికి కాలువల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించి తక్షణమే మురికి కాలువల నిర్మాణాలు చేపట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
– నులిగొండ మహేశ్, అంగడిబజార్ కాలనీ

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



బోర్డుపై రాసిన పదాలు చదివిస్తున్న ఎంఈవో

కెరమెరి: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని పార్ద ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఎండీఎం, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్‌లో ఉదయం, సాయంత్రం హాజరు వేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, భోజనంలో సుచి, శుభ్రత పాటించాలని పేర్కొన్నారు. హెచ్ఎం అరుణ్ ఉన్నారు.

పీఎంశ్రీకి సిఫారసు చేస్తా..

మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఎంఈవో ప్రకాశ్ పాల్గొని మాట్లాడారు. పీఎం శ్రీ కోసం పాఠశాలను సిఫారసు చేస్తానన్నారు. పాఠశాలలో 38 ఉన్న విద్యార్థుల సంఖ్యను 78కి పెంచడంపై ఉపాధ్యాయులను అభినందించారు. హెచ్ఎం మహేశ్, ఉపాధ్యాయులు రమేశ్, రవితేజ ఉన్నారు.

పర్యావరణ కాలుష్యంతో అనర్థాలు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వస్తు ప్రదర్శనలో విద్యార్థినులు

కాగజ్‌నగర్ టౌన్: పర్యావరణ కాలుష్యంతో అనర్థాలు జరుగుతున్నాయని జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్ తెలిపారు. ఈ కారణంగానే వాతావరణంలో మార్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. పర్యావరణానికి నష్టం జరగకుండా ఉండే వస్తువులతో పర్యావరణహిత వస్తు ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ సహకారంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణహిత వస్తు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి హాజరై వస్తు ప్రదర్శనలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ అనుకూల సామగ్రితో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వస్తువులను ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. పర్యావరణ రహిత వస్తు సామగ్రి ప్రదర్శించడంతో అవగాహన పెరుగుతుందని తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి అనేక రకాల ఆరోగ్య కరమైన తినుబండారాలు, పరిసరాల్లో లభించే వస్తువులు సేకరించి నూతన ఉత్పత్తులను తయారు చేసి ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రదర్శనను జూనియర్ కళాశాల, నవోదయ విద్యాలయం విద్యార్థులు తిలకించారు. కళాశాల అధ్యాపకులు లక్ష్మీనరసింహం, శ్రీదేవి, జనార్దన్, రాజేశ్వరి, వెంకటేశం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

లింగాపూర్: మండలంలోని ఏల్లాపటార్ గ్రామంలో ఇంటితో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు, సామగ్రి కాలిపోగా బాధిత కుటుంబానికి రెహమాన్ ఫౌండేషన్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్ ఆసరాగా నిలిచారు. శనివారం రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు సామగ్రి అందజేశారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం 105 ప్లేట్లు అందజేశారు. వారు మాట్లాడుతూ కుడుదుల రాజన్‌బాబు –స్వరూపల కూతురు నిహారిక జ్ఞాపకార్థం ప్లేట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం పర్స చంద్రశేఖర్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రవి, మాజీ సర్పంచ్ పురుషోత్తం, సంతోష్ పాల్గొన్నారు.

బాకీకార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: మండలంలోని కోయచిచ్చాల గ్రామంలో శనివారం కాంగ్రెస్ బాకీ కార్డులను బీఆర్ఎస్ నాయకుడు బిట్టి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

ఘనంగా కళాశాల ఫ్రెషర్స్ డే

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని వసుందర డిగ్రీ, జూ నియర్ కళాశాలల ఫెషర్స్‌డేను పటేల్ గార్డెన్‌లో శని వారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరై మాట్లాడారు. కరస్పాండెంట్ రాజమౌళి, ప్రిన్సిపాల్ నిరత్‌కర్, రవికాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ రేషన్ దుకాణంలో పాడైపోయిన రేషన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న స్టాకు పరిశీలించి రేషన్ శాంపిల్స్ సేకరించారు. ప్రతీ నెల ముక్కిన బియ్యం పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఆర్ఐ రాజేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

డీజీపీని కలిసిన అరిగెల నాగేశ్వర్‌రావు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శివధర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో బెల్లంపల్లి అదనపు ఎస్పీగా పని చేసిన సమయంలో ఇద్దరి మధ్య మంచి స్నేహ బంధం ఉండేదన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఉమేశ్‌యాదవ్ ఉన్నారు.

‘కపాస్ కిసాన్’ యాప్ సద్వినియోగం చేసుకోండి

లింగాపూర్: సీసీఐలో పత్తి విక్రయించే రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏవో సంజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిని విక్రయించే ముందుగా యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. ఇందుకు పట్టాపాసు బుక్కు మొబైల్ నంబర్ లింక్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు క్లస్టర్ పరిధిలో గల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు.

అంబులెన్స్ సిబ్బంది మెరుగైన సేవలందించాలి



తిర్యాణి: మాట్లాడుతున్న నరేశ్ యాదవ్

తిర్యాణి: 108, 102 అంబులెన్స్ సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని 108 అంబులెన్స్ డిస్ట్రిక్ మేనేజర్ నరేశ్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో 108, 102 వాహనాలను పరిశీలించడంతో పాటుగా రికార్డులను తనిఖీ చేశారు. పైలెట్లు దినేశ్, కల్యాణ్, టెక్నీషియన్ కల్యాణ్ ఉన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో ఉన్న 108, 102 అంబులెన్స్‌లను 108 జిల్లా మేనేజరు నరేశ్ యాదవ్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న మెడికల్ స్టాక్, మెడికల్ ఎక్విప్‌మెంట్స్, వర్కింగ్ కండిషన్, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో 108 టెక్నీషియన్ అజయ్‌కుమార్, 108 పైలట్ చిరంజీవి, 102 పైలట్ ప్రవీణ్‌కుమార్‌లు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు



సమ్మె చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమాచారి అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేసే వర్కర్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె శనివారం 37వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని అడిగితే కార్మికులను తొలగిస్తామని భయాందోళనకు గురి చేయడం సరి కాదన్నారు. ఉన్నత అధికారులు దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వర్కర్లు సునీత, రమేశ్, కోటయ్య, రాంబాయి, శివరాం, ప్రేమ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పశువులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్ ప్రక్రియ పరిశీలిస్తున్న సురేశ్

సిర్పూర్(టి): గ్రామాల్లోని ఆవులకు, ఎడ్లకు, గేదెలకు పశువైద్య శాఖ ఆధ్వర్యంలో సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని హీరాపూర్, చుంచుపల్లి గ్రామాల్లో నిర్వహించిన వ్యాక్సినేషన్ క్యాంపులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పశువుల యజమానులు పశువులకు ఎలాంటి సమస్యలున్నా వైద్య చికిత్సలు చేయించాలని సూచించారు. అనంతరం వ్యాక్సినేషన్ ప్రక్రియ పరిశీలించారు. మొత్తం 904 పశువులకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి తెలిపారు. మండల పశువైద్యాధికారి విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీ కార్యాలయంలో హెచ్ఎం, ఎస్సీఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. ప్రతీరోజు ఎస్సీఆర్పీ తమ పరిధిలోని పాఠశాలను విజిట్ చేసి రిపోర్టు అందించాలన్నారు. ఇందులో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీపావళి సందడి..!



మార్కెట్‌లో కలర్లు



మట్టితో తయారు చేసిన దీపాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో దీపావళి సందడి నెలకొంది. శనివారం మార్కెట్‌లో కలర్లు, మట్టితో తయారు చేసిన దీపాలను ప్రజలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

‘బీసీ బంద్’ ప్రశాంతం



కెరమెరి: బంద్ సందర్భంగా మూసి ఉన్న దుకాణాలు



పెంచికల్‌పేట్‌లో..



సిర్పూర్(టి): బంద్ పాటించాలని పిలుపు ఇస్తున్న వివిధ పార్టీల నాయకులు



దహెగాం: పాఠశాలను బంద్ చేయించి బయటకు వస్తున్న నాయకులు



కెరమెరిలో నినాదాలు చేస్తున్న నాయకులు

తిర్యాణి: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో శనివారం తలపెట్టిన బంద్ మండలంలో విజయవంతమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీసీ సంఘాల నాయకులు వేర్వేరుగా బంద్‌లో పా ల్గొన్నారు. అనంతరం స్థానిక కుమురం భీం చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలో బీసీ రిజర్వేషన్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మండల కేంద్రంలోని వాణిజ్య దుకాణాల యజమానులు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని డిమాండ్ చేశారు.

సిర్పూర్(టి): రాష్ట్ర బంద్ పిలుపు మేరకు శనివారం సిర్పూర్(టి) మండలంలో బంద్ ప్రశాంత వాతావరణలో కొనసాగింది. మండలంలోని వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని స్థానిక వ్యాపార సముదాయాల యజమానులకు వివరించారు.

దహెగాం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో శనివారం చేపట్టిన బంద్ మండల కేంద్రంలో సంపూర్ణంగా జరిగింది. దుకాణ సముదాయాలు బంద్ పాటించాయి. ఆయా పార్టీల నాయకులు మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను బంద్ చేయించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుగంటి భీమన్న, బీఆర్ఎస్ నాయకుడు ఎల్కరి ప్రశాంత్, ఆయా పార్టీల నాయకులు పుప్పాల సత్యనారాయణ, పులగం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: బీసీ రిజర్వేషన్ 42 శాతం ప్రకటించాలని కోరుతూ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆల్ పార్టీ బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం అన్ని పార్టీల నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మహాత్మ గాంధీ, జ్యోతిరావు పూలేకు నివాళ్లు అర్పించారు. నాయకులు కొట్రంగే తిరుపతి, దండుగుల శ్రీనివాస్, వెంకట్ నాయక్, కూటికల ఆనంద్‌రావు, కంబాల వినేశ్, సురేందర్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీ రిజర్వేషన్‌లకు చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంట్‌లో పెట్టి ఆమోదించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు సీపీఐ పార్టీ మద్దతు ప్రకటించి నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, సీపీఐ జిల్లా సమితీ సభ్యులు మహేశ్, వికాస్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మద్దతు..

బంద్‌కు సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. పార్టీ శ్రేణులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నాయకులు టీకానంద్, రాజేందర్, మాలశ్రీ, రాజు, రాజ్‌కుమార్, కృష్ణమాచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మోవాడ్‌లో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోవాడ్ గ్రామ పంచాయతీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తండ్రి జ్ఞాపకార్థం వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృథాగా ‘భగీరథ’ !



కెరమెరి: ప్రజలకు అందించాల్సిన శుద్ధ జలం వృథాగా పోతుంది. మండలంలోని ధనోరా పంప్‌హౌజ్ వద్ద శనివారం మిషన్ భగీరథ నీరు పైప్‌లైన్ పది చోట్ల పగిలిపోయింది. నీరు అల్లంత ఎత్తున ఎగిసి పడి సమీప ప్రాంతమంతా జలమయంగా మారింది. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కోనేరు కోనప్ప అభిమాని డోంగ్రె అరుణ్(35) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం మృతదేహానికి కోనప్ప నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ కిజర్ హుస్సేన్, మాజీ ఉపసర్పంచ్ తోట మహేశ్, నాయకులు దుర్గం విక్రమ్, ఇఫాత్‌హుస్సేన్, దుర్గం సునీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.